క్లుప్తంగా

శ్రీ పుష్పశయన గణపతిగా స్వామివారు



గుడివాడటౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని స్వామి వారిని మంగళవారం శ్రీ పుష్ప శయన గణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈనెల 28వ తేదీన స్వామి వారి నిమజ్జనం ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ కోరారు.

4న దుకాణాలకు బహిరంగ వేలం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి చెందిన షాపులకు అక్టోబర్ 4న టెండరు కం బహిరంగ వేలంపాటలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య మంగళవారం తెలిపారు. ఆలయానికి చెందిన ఏ బ్లాక్ షాపింగ్ కాంప్లెక్స్‌కు చెందిన షాపు నంబరు 3, సి బ్లాక్ షాపింగ్ కాంప్లెక్స్‌కు చెందిన షాపు నంబరు 1, ఈ బ్లాక్ కాంప్లెక్స్‌కు సంబంధించి 4, 5 నంబర్లు గల షాపులకు టెండరు కం బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు కార్యాలయం పనివేళల్లో వ్యక్తిగతంగా సంప్రదించవచ్చని తెలిపారు.

బోధనలో నైపుణ్యాలు చూపాలి

ముదినేపల్లి రూరల్: ప్రాథమిక విద్యార్థులకు సబ్జెక్టుల బోధనలో నైపుణ్యాలు చూపాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు తెలుగు, హిందీ, సైన్సు సబ్జెక్టులపై స్కూల్ కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను గుర్తిస్తూ శిక్షణలో పొందిన నైపుణ్యాలను పాఠ్యాంశాల బోధనకు వర్తింపచేయాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నదీ గుర్తించి అందుకు అనుగుణంగా బోధన చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్లు ఆయా సబ్జెక్టులకు సంబంధించి బోధనా నైపుణ్యాలను ఉపాధ్యాయులకు వివరించారు.

రూ.లక్ష బీమా సొమ్ము అందజేత



మండవల్లి: ప్రమాదంలో కాలు కోల్పోయిన వ్యక్తికి మంగళవారం పీఎంఎస్‌బీవై పథకంలో ఇండియన్ బ్యాంక్ విజయవాడ డెప్యూటీ మేనేజర్ బి.బిస్వనాథ్ ప్రమాదబీమా చెక్‌ను అందజేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని ఆనందపురం గ్రామానికి చెందిన రేమల్లి సతీష్‌బాబు స్థానిక ఇండియన్ బ్యాంక్‌లో 2019లో సంవత్సరానికి రూ.20 చెల్లించి ప్రధానమంత్రి సురక్ష బీమా పథకంలో చేరాడు. 2 వాయిదాలు చెల్లించాడు. 2021 డిసెంబర్ 5న ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఆటో ఢీకొని ప్రమాదవశాత్తు ఒక కాలు పూర్తిగా విరిగిపోయింది. దీంతో అతనికి రూ.లక్ష బీమా సొమ్ము అందజేశారు. ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బి.దుర్గారావు, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ ఎస్ భాస్కరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం

పామర్రు: స్థానిక సచివాలయం –1 పరిధిలోని ఆరవ వార్డుకు చెందిన ఓరుగంటి చంటి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుని భార్య ఓరుగంటి స్వరూపకు వైఎస్సార్ బీమా కింద మంగళవారం రూ.10 వేలను ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ఎస్.శ్రీలక్ష్మి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సృజన్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన వైపు అందరూ పయనించాలి

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

పామర్రు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని కృష్ణాజిల్లా పరిషత్ అధ్యక్షురాలు ఉప్పాల హారిక అన్నారు. స్థానిక 20వ వార్డులోని బాపూజీ పేటలో గణపతి నవరాత్రులలో భాగంగా మంగళవారం మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణితో కలిసి ఆమె పాల్గొని అన్న సమారాధన ప్రారంభించారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను తరచూ నిర్వహించి ప్రజలలో భక్తి భావనను అభివృద్ధిపర్చాలని కోరారు. అందరూ శాంతి కాముకులుగా జీవించాలని, అప్పుడే దేశం శాంతి మయంగా మారుతుందని అన్నారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామికి విశేషంగా పూజలను నిర్వహించారు. అనంతరం బాపూజీ పేట గౌడ యువత ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 2వేల మంది భక్తులు పాల్గొని అన్న సమారాధన స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పాల రాము, ఆరేపల్లి శ్రీహరి, యార్లగడ్డ శ్రీనివాసరావు, బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్ రెడ్డి, పరసా కిషోర్, ఆరేపల్లి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



పామర్రు బాపూజీ పేటలో వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పక్కనే వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జ్ఞానమణి

కొనసాగుతున్న నవరాత్రి మహోత్సవాలు

గుడివాడటౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాలు మంగళవారం కూడా కొనసాగాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కొణిజేటి శ్రీనివాసరావు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, కృష్ణ, హారిక, మూడెడ్ల ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమాలు

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో 31వ వార్షిక గణపతి నవరాత్రి మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా 31 అడుగుల మట్టి వినాయక ప్రతిమను తయారు చేసి 21 రోజుల పాటు విశేషంగా పూజలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గణపతి హోమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత గోపూజ, నిత్యపూజ, గణపతి పంచాయతన, నవగ్రహ శాంతి హోమాలను నిర్వహించారు. అనంతరం జన్ను శ్రీనివాసరావు, నాగమణి దంపతుల సౌజన్యంతో వచ్చిన భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి అప్పల రామారావు, సభ్యులు పాల్గొన్నారు. రాపర్లలోని వినాయక స్వామి ఆలయంలో గణపతి హోమాన్ని నవగ్రహ కలశ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలను హోమాలను నిర్వహించారు.



పామర్రులో గణపతి, నవగ్రహ హోమాలను నిర్వహిస్తున్న భక్తులు



వీరంకిలాకులో వినాయకుడి విగ్రహం ఊరేగింపు

ఘనంగా గణేష్ నిమజ్జనం

పమిడిముక్కల: మండలంలో గణపతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వీరంకిలాకు విఘ్నేశ్వర యూత్ మెయిన్ సెంటర్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా వైభవంగా పూజలు నిర్వహించారు. స్వామి వారిని మంగళవారం భారీ ఊరేగింపు, తీన్‌మార్ డప్పులు, డీజే సౌండ్స్‌తో గ్రామంలో ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకొంటూ, డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న బందరు కాలువలో నిమజ్జనం చేశారు.

గురజాడలో వైభవంగా గణేష్ ఉత్సవాలు

పమిడిముక్కల: మండలంలోని గురజాడ గాంధీ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి 9 రోజులుగా వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. స్వామి వారిని మంగళవారం ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యన్నారాయణ(నాని), వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు రాజులపాటి రామచంద్రరావు, సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్, ఉయ్యూరు వార్డు కౌన్సిలర్ రాజులపాటి నాగేంద్రప్రసాద్(చిన్ని), విశ్రాంత ఉద్యోగి పడమట వీరకుమార్, రాజులపాటి జగదీష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులకు మంచి జరగాలని స్వామి వారిని కోరుకున్నట్లు సత్యన్నారాయణ(నాని) తెలిపారు. భక్తులకు భారీ అన్నసంతర్పణ చేశారు. గురువారం స్వామి వారి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



గురజాడలో స్వామి వారికి పూజలు చేస్తున్న ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని

జగనన్న ఆరోగ్య సురక్ష జయప్రదం చేయండి

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సమన్వయంతో పనిచేసి జయప్రదం చేయాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. ఈ నెల 30 నుంచి హెల్త్ క్యాంపుల నిర్వహణపై స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శీతనపల్లి, కొల్లేటికోట పీహెచ్‌సీల ఆరోగ్య సిబ్బందికి మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ 30వ తేదీన మొదటి హెల్త్ క్యాంపు పెంచికలమర్రు గ్రామంలో చేపడుతున్నామన్నారు. ఇప్పటికే క్యాంపుల నిర్వహణపై వైద్య బృందాలను నియమించామన్నారు. ప్రతి గృహంలోనూ అనారోగ్యం కలిగిన ప్రజలను గుర్తించి క్యాంపులకు వలంటీర్లు తీసుకురావాలన్నారు. సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యాధికారులు, స్పెషలిస్టులు క్యాంపుల విజయంలో కీలక బాధ్యత వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పీహెచ్‌సీల డాక్టర్లు బి.శంకర్, బి.హేమలత, కె.అన్నపూర్ణ, ఎల్.కిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కైకలూరులో జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అడవి కృష్ణ

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కైకలూరు: చేపల లోడు లారీ ఢీకొని యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎదుట జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. కైకలూరు టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆటపాక గ్రామంలో మాజీ ఎంపీ మాగంటి బాబు నివాసం ఎదురుగా మహమ్మద్ మునీర్ టైర్ల పంక్చర్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. అతని చిన్న కుమారుడు మహ్మద్ వసీం అక్రం(24) దుకాణం వద్దకు తాగునీరు తీసుకురావడానికి స్కూటర్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా గుడివాడ నుంచి ఆకివీడు వెళుతున్న చేపల లారీ ఢీకొంది. వసీం అక్రం లారీ వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి మునీర్ ఫిర్యాదుతో ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

రేపు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశం

మచిలీపట్నంటౌన్: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గెజిటెడ్ అధికారులుగా ప్రమోషన్లలో రిజర్వేషన్లను కాపాడుకునేందుకు సంబంధించి చర్చించేందుకు గురువారం మచిలీపట్నంలో సమావేశం నిర్వహిస్తామని ఏపీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ సంఘ నాయకులు కర్రా సునీల్‌కుమార్, మద్దాల కృష్ణ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లకు సంబంధించిన నిబంధనలు అమలవుతున్నదీ, లేనిదీ ఈ సందర్భంగా చర్చిస్తామన్నారు. సమావేశానికి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు హాజరుకావాలని వారు కోరారు.

రేపు స్వామివారి హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారికి హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను గురువారం ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కిస్తామని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఆసక్తిగల భక్తులు డ్రెస్‌కోడ్‌లో లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని చెప్పారు. హుండీ కానుకల లెక్కింపు కారణంగా ఆ రోజు స్వామివారి నిత్య శాంతి కల్యాణాన్ని ఉదయం 7 గంటలకే ప్రారంభిస్తామన్నారు.

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శిగా జానీ సాహెబ్



గుడివాడటౌన్: స్థానిక కాకర్ల వీధిలోని గాంధీ మున్సిపల్ హైస్కూల్ హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న షేక్ జానీ సాహెబ్ కృష్ణాజిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శిగా నియమితులైనట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా ఈ మేరకు ఈనెల 25న ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. జానీ సాహెబ్ నియామకం పట్ల పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం ప్రకటించారు.

తాడంకిలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ర్యాలీ



తాడంకిలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పమిడిముక్కల: తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ నాయకుల ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని హెచ్‌ఎం వైవీఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంభపు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐలమ్మ జీవితం ఆదర్శప్రాయం



గోనెపాడులో ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రజక సంఘ నాయకులు

కైకలూరు: తెలంగాణ ఉద్యమకారిణి, వీరవనిత చిట్యాల ఐలమ్మ జీవితం ఆదర్శప్రాయమని పలువురు రజక సంఘ నాయకులు చెప్పారు. ఐలమ్మ 128 జయంతి సందర్భంగా గోనెపాడులో ఐలమ్మ రజక సంక్షేమ సంఘం, కైకలూరులో శ్రీరామ రజక సేవా సంఘాల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఐలమ్మ రజక సంక్షేమ సంఘం నాయకులు కంచర్ల రామకృష్ణ నిర్వహణలో కైకలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. పలువురు రజక నాయకులు మాట్లాడుతూ జీవో 343 ప్రకారం రజకుల చెరువులపై పూర్తి హక్కులను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు వడ్లమన్నాటి వెంకటేశ్వరరావు, కొండపల్లి నాగేశ్వరరావు, రామారావు, ధర్మారావు, మారుతి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, గోలుకొండ రాము, చంటి, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించండి

అధికారులకు ఎమ్మెల్యే కొడాలి నాని ఆదేశం

గుడివాడటౌన్: ప్రజలకు సంబంధించిన చిన్న చిన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) అధికారులను ఆదేశించారు. స్థానిక రాజేంద్రనగర్ లోని తన నివాసంలో మంగళవారం నియోజకవర్గానికి చెందిన పలువురు ఆయనను కలిసి సమస్యలు విన్నవించారు. దీనిపై స్పందించిన కొడాలి నాని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, దానిని గుర్తించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలేటి చంటి, ఆంజనేయ ప్రసాద్, చుండూరు శేఖర్, బాలు, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొడాలి నాని

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

తోట్లవల్లూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలియజేశారు. మండలంలోని వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పామర్రు నియోజకవర్గ స్థాయి అండర్ 14, అండర్ 17 విభాగాలలో కబడ్డీ టీముల ఎంపిక మంగళవారం ఉత్సాహంగా జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొన్నారు. వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాల నుంచి అండర్ 14, 17 విభాగాలలో 10 మంది బాల, బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరాజ్యలక్ష్మి తెలియజేశారు. జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలు బహూకరించి అభినందించారు. గుడివాడ డీవైఈఓ పద్మారాణి, తహసీల్దార్ కుసుమకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు కాసరనేని అనూరాధ, ఎంఈఓ జి.వెంకటేశ్వరరావు, ఎంఈఓ(2) సురేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు మాసిలామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వల్లూరుపాలెంలో జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పోలింగ్ కేంద్రాల్లో చేర్పులు, మార్పులకు అవకాశం

పామర్రు: ఓటర్ల జాబితాలతో పాటు పోలింగ్ కేంద్రాలలో కూడా ప్రస్తుతం చేర్పులు, మార్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు పామర్రు నియోజకవర్గ ఈఆర్‌వో శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాలలో మొత్తం 238 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని అన్నారు. వీటిలో పేర్లు మార్పుదల చేసేవి 42 ఉన్నాయని, అంతే కాకుండా బూత్ స్థాయిలో చేర్పులు మార్పులు చేసేవి 19 వరకు ఉన్నాయని అన్నారు. వీటిని అఖిలపక్ష నాయకులకు తెలియజేశామని, వారి అనుమతులతో బూత్ స్థాయిలో మార్పులు చేస్తున్నామన్నారు. ఓట్ల సర్వే పనులు పూర్తి అయ్యాయని అన్నారు. సర్వేలను పారదర్శకంగా పూర్తిచేశామని, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని అన్నారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ఆన్‌లైన్ పనులు కొంత మందకొడిగా సాగుతున్నాయని అన్నారు. రానున్న ఎన్నికలకు అన్ని విధాలా సంసిద్ధంగా ఉండే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వీవీ భరత్‌రెడ్డి, సత్యనారాయణ, వి. నాగభూషణం, డి.రాజ్యలక్ష్మి, తోట్లవల్లూరు డీటీ ధనలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఈడే గంటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో శ్రీనివాసరావు

వినాయక స్వామికి వెండి కిరీటం బహూకరణ

పామర్రు: స్థానిక గుడివాడ రోడ్డులోని బాపూజీ పేటలోని శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో నవరాత్రి మహోత్సవాల సందర్భంగా భక్తులు స్వామికి వెండి కిరీటాన్ని మంగళవారం బహూకరించారు. భక్తులు మానికొండ సాంబయ్య (కొత్తూరు సాంబయ్య) శేషారత్నం దంపతుల సౌజన్యంతో స్వామికి వెండి కిరీటాన్ని అందజేశారు. సుమారు 250 గ్రాముల బరువు గల ఈ కిరీటాన్ని ఆలయంలో కమిటీ సభ్యుల ద్వారా స్వామికి అలంకరించారు. తదుపరి స్వామికి విశేషంగా పూజలను చేశారు. అనంతరం భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు భక్తులు పాల్గొన్నారు.



వెండి కిరీటాన్ని స్వామికి అలంకరించి పూజలు చేస్తున్న దాతలు

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి

పెదపారుపూడి: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మసిముక్కు శివనాగమణి అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాగమణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుంటూ మంచి పోషక విలువలు ఉంటాయని వాటి ద్వారా ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందిస్తారన్నారు. చిన్నారులను కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి అక్కడ అందించే పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం పోషకాహారంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కానుకొల్లులో పోషకాహార వారోత్సవాలు

మండవల్లి: మండలంలోని కానుకొల్లులో మంగళవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ ఆనంద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్భిణులు, బాలింతలకు బలవర్ధకమైన పోషకాహారం అందజేసి, వారికి రక్తహీనత కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్పవల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికం

కైకలూరు: చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని ఐసీడీఎస్ సీడీపీవో బి.ఆనంద్ చెప్పారు. పోషకాహార వారోత్సవాల్లో భాగంగా తామరకొల్లు – 1 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లులు, గర్భిణులకు అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, మహిళా సంరక్షణ సెక్రటరీ పద్మజామాధురి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, జ్ఞానసుందరి, నిర్మలాకుమారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సులభతర బోధన అలవర్చుకోవాలి

కైకలూరు: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే బోధనా పద్ధతులను అధ్యాపకులు అలవర్చుకోవాలని ఎంఈవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలో వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనా విధానాలను ఉపాధ్యాయులు అవగాహన చేసుకుని పాఠాలను బోధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని అందరూ సమన్వయంతో పనిచేసి పెంచాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.